## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం


కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్ కాలనీలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త జామి రాజేష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్థానిక నాయకులు, కార్యకర్తలు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో ఆమె స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు పార్టీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆదివారం సాయంత్రం జామి రాజేష్ ఇంటికెళ్లి పరామర్శించారు, వైద్య ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబ సభ్యులకు రూ.15 వేల నగదు అందజేశారు. వార్డులో ఏ కార్యకర్తకు కష్టం వచ్చిన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిషోర్, మధు, మురళీ, వేళాంగిణిరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇస్లాం శాంతి మార్గం


మాట్లాడుతున్న మౌలానా ఫజులుర్రహ్మాన్ ఖురేషి ఉమరి

జగదాంబ: ఇస్లాం శాంతి మార్గమని మౌలానా ఫజులుర్రహ్మాన్ ఖురేషి ఉమరి అన్నారు. ఆదివారం జీవీఎంసీ 39వ వార్డు డాక్టర్ దీన్ షాదీఖానాలో అహ్లెహదీస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 28 మంది ధార్మిక పండితులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మౌలానా ఫజులుర్రహ్మాన్ ఖురేషి ఉమరి మాట్లాడుతూ శాంతియుతమైన వాతావరణంలో అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ఇస్లాం సందేశం ప్రకారం ఇతరులకు సాయం చేయాలన్నారు. పిల్లలకు విద్యా బుద్ధులతో పాటు నైతిక విలువలు నేర్పించాలన్నారు. మానవాళికి మేలు చేసే సందేశాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు చిన రెహ్మాన్, అబ్దుల్ గఫార్, ఫారఖ్‌ఖాన్, షేక్ షిలార్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్, కళా ఆస్పత్రి సహకారంతో వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కళా ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ పి.వి.రమణమూర్తి పర్యవేక్షణలో వైద్యుల బృందం స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, ఆర్థోపెడిక్, గైనిక్, జనరల్ మెడిసిన్‌కు సంబంధించి పరీక్షలు జరిపారు. వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణను తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ రమణమూర్తి వివరించారు. వైద్య శిబిరంలో అత్యధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సనపల భానుప్రకాష్, సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, ఇతర కార్యవర్గ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

### కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు వారు తెలిపారు. పాత కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని వారంతా డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని వేళలు 8 నుంచి 12 గంటలకు పెంచొద్దని డిమాండ్ చేస్తూ నినదించారు. సీఐటీయూ జోన్ సెక్రటరీ అప్పారావు, ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతం.. ఎప్పుడు అంతం?


పూర్ణామార్కెట్‌లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం


రోజూ టన్నుల కొద్దీ యార్డుకు వస్తున్న ప్లాస్టిక్

- నెమ్మదించిన తనిఖీలు, దాడులు, జరిమానాలతో పుంజుకుంటున్న వినియోగం
- పర్యావరణ పరిరక్షణ ప్రశ్నార్థకం
- దీటైన చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికుల సూచన

జగదాంబ: ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని కొన్నాళ్ల కిందట విస్తృతంగా ప్రచారం చేసిన జీవీఎంసీ తర్వాతి కాలంలో దీనిపై మిన్నకుండిపోయింది. దీంతో తిరిగి ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. మొదట్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, దుకాణాలపై దాడులతో వ్యాపారుల వెన్నులో వణుకు పుట్టించారు. ప్లాస్టిక్ విక్రేతలు, వాడకందారులు, ప్లాస్టిక్ కవర్లలో వస్తువులు పెట్టి విక్రయించే వ్యాపారులపై దాడులు చేసి జరిమానాలు విధించిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో కొన్నాళ్ల పాటు తగ్గిన నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ఇప్పుడు యథాస్థితికి చేరుకుందని పలువురు వాపోతున్నారు.

**జీవీఎంసీ 35వ వార్డులో..**

జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ దరి 35కు పైగా హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలు ఉన్నాయి. అధికారుల దాడులు, కేసుల నమోదు, అపరాధ రుసుము విధించడం వంటి వాటి ద్వారా ఈ వ్యాపారులు దాదాపు ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు మానేశారు. అయితే తర్వాతి కాలంలో తనిఖీలు, దాడులు, జరిమానాలు నెమ్మదించడంతో తిరిగి ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరిగిపోయింది.

**అన్ని చోట్లా కనిపిస్తూ..**

నిషేధిత ప్లాస్టిక్ ఇప్పుడు అన్ని దుకాణాల్లో కనిపిస్తోంది. తోపుడుబళ్లు, చిరు వ్యాపారులు, పూల దుకాణాలు, టీషాపులు, మాంసం దుకాణాల వద్ద ప్లాస్టిక్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రజలు గుడ్డ, నార సంచుల వంటి వాటిని ఇంటి నుంచి తీసుకు రావడం మానేసి యథావిధిగా వట్టి చేతులతో దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లలో సరకులు తెచ్చుకుంటున్నారు. అధికారుల అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించిన అరటి ఆకులు, పేపర్ గ్లాసులు, ప్లేట్లు, జ్యూట్ బ్యాగ్‌లు, వంట చెరకుతో తయారు చేసిన సంచులు ఇప్పుడు ఎక్కడా కనిపించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రకృతికి విరుద్ధ లక్షణాలు..**

ప్లాస్టిక్‌లో ప్రకృతి ధర్మానికి విరుద్ధమైన లక్షణాలు అనేకం ఉన్నాయి. అందుకే ఇది సమస్త జీవులకు శత్రువు వంటిది. ప్లాస్టిక్ పాలిమరైజేషన్ ప్రక్రియ ద్వారా కృత్రిమంగా సృష్టించబడిన రసాయన గొలుసులతో తయారు అవుతోంది.


మార్కెట్‌లో హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణం

ప్లాస్టిసైజర్లు, ఫిల్లర్లు, రంగులు, అనేక ఇతర రసాయనాలు కలిగిన ప్లాస్టిక్ వాడకం ప్రమాదం. సంవత్సరాల తరబడి భూమిలో జీర్ణం కాని ప్లాస్టిక్ నీటి పారుదల వ్యవస్థను దెబ్బ తీస్తుంది. ప్రపంచం ప్రతి సంవత్సరం 300 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేస్తుందని అంచనా. ఇంతటి ప్లాస్టిక్ భూమిలో జీర్ణం కావాలంటే ఎంత కాలం పడుతుందో ఎవరికీ తెలియదు. మన దేశంలో తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్‌లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించారు.




### విస్తరిస్తున్న మన్‌కీ బాత్


మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షిస్తున్న రూపాకుల రవికుమార్

మహారాణిపేట: ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ఆదివారం ప్రసారమైంది. ఈ కార్యక్రమాన్ని ఏపీ బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మోదీ పాల్గొన్నారన్నారు. దాదాపు పదేళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా మరింత విస్తరిస్తోందన్నారు. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ట్రకోమారహిత దేశంగా భారత్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించినట్లు మోదీ వెల్లడించారని తెలిపారు. మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను అభినందించారన్నారు. మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ వినిపించారని తెలిపారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాని సూచించారని రూపాకుల తెలిపారు.

### వెలమలకు ప్రాధాన్యమివ్వాలి

ఏయూక్యాంపస్: నామినేటెడ్ పదవుల్లో వెలమలకు తగిన ప్రాధాన్యమివ్వాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలన్నారు. వెలమ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్డ సత్యం, కార్యదర్శి పి.శ్రీనివాస్, విశాఖ జిల్లా ఇన్‌చార్జి ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు


ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై వాహనాల తనిఖీ

అల్లిపురం: ఆదివారం రాత్రి ముఖ్య కూడళ్లలో నాకాబందీ, వాహన తనిఖీలు చేపట్టారు. అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే విధంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, అధిక లోడ్ వాహనాలు, వాహన రికార్డుల పరిశీలన, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ముమ్మర తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. 48 ముఖ్య కూడళ్లలో జరిగిన ఈ తనిఖీల్లో మొత్తం 115 వాహనాలు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో హెల్మెట్లు ధరించని 60 మంది ద్విచక్ర వాహన చోదకులు, నంబర్ ప్లేట్ సక్రమంగా లేని 16 వాహనాలు, 3 ట్రిపుల్ రైడింగ్, 12 సెల్‌ఫోన్ డ్రైవింగ్, 19 మోటార్ వెహికల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ‘కమలాకర కళాలయ’ సంగీత సంస్థ ప్రారంభం


సంస్థను ప్రారంభిస్తున్న కర్ణాటక సంగీత విద్వాంసురాలు జలజాక్షి, యోగేష్ తదితరులు

సీతంపేట: మృదంగ విద్వాంసుడు జి.వెంకటరావు సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘కమలాకర కళాలయ’ మృదంగ సంగీతవాద్య సాంస్కృతిక సంస్థ శంకరమఠంలో మంగళ వాయిద్యాల నడుమ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కళా సంస్థను కమలాకరరావు తనయుడు కమలాకర యోగేష్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.జలజాక్షి మాట్లాడుతూ కమలాకరరావు మృదంగ వాయిద్య కళాకారుడిగా సంగీత ప్రపంచానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన పేరున సంగీత సంస్థను ఏర్పాటు చేసిన వెంకటరావును అభినందించారు. యోగేష్ మాట్లాడుతూ మా తండ్రి కమలాకరరావు దేశ స్థాయిలో కర్ణాటక సంగీత విద్వాంసులుగా పేరొందిన కళాకారులకు తనదైన శైలిలో మృదంగ వాద్య సహకారం అందించి గొప్ప కళాకారుడిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ప్రేమ సమాజం పూర్వ కార్యదర్శి కె.జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది కె.నరసింహమూర్తి, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ ప్రసంగించారు. అనంతరం డాక్టర్ ద్వారం త్యాగరాజు సమక్షంలో ద్వారం మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సంగీత గాత్ర కచేరి, జి.వెంకటరావు శిష్య బృందంచే మృదంగ లయ విన్యాసం వీనుల విందుగా సాగింది. కళాభిమానులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి


సంఘీభావం తెలుపుతున్న బీసీ కులాల సంఘం నాయకులు

సీతంపేట: బీసీల్లో ఇప్పటివరకు రాజకీయ ప్రాధాన్యం లేని కులాలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని బీసీ కులాల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పార్టీలకతీతంగా బీసీ కులాల తృతీయ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు రేవు రత్నకుమారి, పావులూరి హనుమంతరావు, నాగిడి సాంబశివరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఏకమై తమ హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. ఇప్పటికే గుంటూరు, విజయవాడలో సమావేశాలు ఏర్పాటు చేశామని, అందులో భాగంగా విశాఖలో కూడా సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. అధికార పార్టీలు బీసీలకు తగు ప్రాధాన్యమిచ్చి చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరారు. లేని పక్షంలో తమ హక్కులు సాధనకు పోరాటాలు చేస్తామని అన్ని పార్టీలను హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పిన్నింటి ఆదిమూర్తి యాదవ్, బీసీ రమణ, వాసుపల్లి జానకీరామ్, రాష్ట్ర బీసీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## చురుగ్గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు


ముడసర్లోవ ప్రాంతంలో పొక్లెయిన్లు, లారీలతో జరుగుతున్న పనులు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద నిర్మిస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ముడసర్లోవ ప్రాంతంలో విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రైల్వే జోన్ కోసం 52 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. దీనిలో సుమారు ఆరు నెలల కిందట ల్యాండ్ టెస్టింగ్ పనులు చేపట్టడంతో పనులు ప్రారంభించారు. నెల రోజులుగా పూర్తిస్థాయి పనులు జరుపుతున్నారు. ప్రస్తుతం 14 ఎకరాల్లో విశాలమైన 12 అంతస్తుల భవనం నిర్మాణం పనులు చేపట్టారు. అండర్ గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లు, పైన 10 ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో పనులకు ఎలాంటి ఆటంకంగా రాకుండా ముందు జాగ్రత్తగా ఇసుక తీసుకొచ్చి నిల్వ ఉంచారు. రైల్వే జోన్ రీజనల్ మేనేజర్ కార్యాలయంతోపాటు ఉన్నతాధికారుల క్వార్టర్స్ అన్నీ ఇక్కడే నిర్మిస్తున్నారు.

## ప్రభుత్వ విధానాల్లో మార్పుతోనే అభివృద్ధి

- అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో వక్తలు


సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యుడు రామచంద్రయ్య

దాబాగార్డెన్స్: సామాన్య ప్రజల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా విధానాలుండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ‘విశాఖపట్నం–అభివృద్ధి–నిధులు–సంస్కరణల’పై ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విశ్రాంత ఆచార్యుడు సి.రామచంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా నిలబడే పునాది లేకపోయినా గాల్లో ఎగురుదామనే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, నగరాల్లో ఫ్లై ఓవర్లు, మెట్రో రైళ్లు ఎన్ని వచ్చినా, రద్దీ తగ్గదని హైదరాబాద్ అనుభవాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే దీనికి పరిష్కారమని, ప్రజా రవాణా తీసుకొచ్చినట్టయితే రద్దీ, ప్రమాదాలు, కాలుష్యం, అసహనం వంటివి తగ్గుతాయని పేర్కొన్నారు. సింగపూర్ నమూనా గురించి పదే పదే వల్లించే నేతలు ఆ సింగపూర్‌లో అమలవుతున్న రవాణా, మంచి నీటి సదుపాయం కల్పన వంటి వాటిని ఇక్కడ అమలు చేయాలన్నారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా ఉన్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి వచ్చిందని, విశాఖపట్నానికి వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను విక్రయానికి పెడుతున్నారని, రాష్ట్ర ఖజానా నుంచి గత దశాబ్ద కాలంలో ఒక్క రూపాయి కూడా జీవీఎంసీకి ఇవ్వలేదు సరికదా జీవీఎంసీ పన్నుల ఆదాయం రూ. 350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందే తప్ప జీవీఎంసీకి ఇవ్వలేదన్నారు. పట్టణ పౌర సమైక్య కన్వీనర్ సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం వార్తల్లోకి ఎక్కిందని, ఆరోగ్యం కోసం యోగా మంచిదే కానీ పట్టణ ప్రజలకు సరైన ఉపాధి, పరిశుభ్రమైన మంచినీరు, ఉండడానికి ఇళ్లు వంటివి లేకపోతే ప్రజలు ఎలా ఆరోగ్యంగా ఉంటారని, ముందు వాటి సంగతి ఆలోచించాలన్నారు. సీపీఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కౌన్సిల్‌కు ఉన్న ప్రాధాన్యత ప్రస్తుతం లేదని, నిర్ణయాలన్నీ ఎక్కడో జరిగి జీవీఎంసీపై రుద్దడం జరుగుతోందని, మార్కెట్ వేల్యూ ఆధారిత పన్ను కచ్చితంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగరాభివృద్ధి అజెండాలో మధ్య తరగతి వారితో పాటు మురికివాడల ప్రజల సమస్యలు కూడా అభివృద్ధిలో ప్రధాన అజెండాగా తీసుకురావాలని, పోరాడితేనే హక్కులు వస్తాయని తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం ప్రతినిధి డాక్టర్ కె.పద్మ నేతృత్వంలో కేంద్రం కార్యక్రమాల ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వార్వా అధ్యక్షుడు ఎస్.ప్రకాశరావు, నివాస్ కార్యదర్శి పిట్ట నారాయణమూర్తి, మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి.మధు మాట్లాడారు.

### తెలుగు సమాఖ్య కృషి అభినందనీయం


శిరేల సన్యాసిరావును సత్కరిస్తున్న తెలుగు సమాఖ్య ప్రతినిధులు

సీతంపేట: రాష్ట్రేతర తెలుగు సమాఖ్య 10వ వార్షికోత్సవం కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ, విశిష్ట అతిథిగా సురవరం ప్రతాపరెడ్డి, ఉపకులపతి ఆచార్య వెలిదండ్ల నిత్యానందరావు, అతిథులుగా రాజస్థాన్ తెలుగు సంఘం అధ్యక్షుడు వి.ఎస్.ఆర్.మూర్తి, విశాఖ సంస్కృతి సంపాదకుడు శిరేల సన్యాసిరావు, సాహితీవేత్త రాయప్రోలు భగవాన్ పాల్గొని తెలుగు భాష వికాసం కోసం రాష్ట్రేతర తెలుగు సమాఖ్య చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తెలుగు భాష వికాసానికి కృషి చేస్తున్న శిరేల సన్యాసిరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన ప్రవాసాంధ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఫ్రీ సీట్ల అడ్మిషన్లపై దృష్టి సారించాలి

సీతంపేట: పేద విద్యార్థుల విద్యాభ్యున్నతి దృష్ట్యా అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ఉచిత సీట్ల అడ్మిషన్లలో లోటుపాట్లపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం 2009, సెక్షన్ 12(1)(సి)ను అనుసరించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రౌండ్‌లో కేటాయించిన ఫ్రీ సీట్లలో అధిక శాతం పాఠశాలలు అడ్మిషన్లు నిరాకరించాయని ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఎందుకు నిరాకరిస్తున్నాయో సంబంధిత పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం సమావేశం నిర్వహించి లోటుపాట్లు లేకుండా సరిచేసి ఉచిత విద్యకు ఎంపికైన వారికి సీట్లు కేటాయించేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో నూరు శాతం ఆర్టీఈ చట్టం అమలుతో పేద పిల్లల హక్కులు సాకారమవుతాయన్నారు.

## ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్



పౌర గ్రంథాలయంలో ఆసక్తిగా కథ వింటున్న బాలబాలికలు

సీతంపేట: విశాఖపట్నం పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రపంచ సంగీత దినోత్సవం, జాతీయ పుస్తక పఠన మాస వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. సంగీతం, సాహిత్యం, కళల ఉత్తేజకరమైన సమ్మేళనాన్ని ఆకట్టుకునేలా అందించారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కథకురాలు, వాయిస్ ఆర్టిస్ట్ ఎం.సీతాశ్రీనివాస్, పూర్వ విద్యార్థులతో కలిసి సంగీతంతో శ్రావ్య వినోదం అందించారు. మొదటి సెషన్‌లో బుందేల్ ఖండ్ జానపద కథ ‘వాట్ ఏ సాంగ్’ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు కథపై చర్చించారు. వర్క్‌షీట్లు నింపి రంగులు వేశారు. రెండో సెషన్‌లో సంగీతంపై మక్కువ, గిటార్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న బాలుడి స్ఫూర్తిదాయ ప్రయాణాన్ని వివరించారు. లైవ్ గిటార్ ప్రదర్శన, కొంకణి పాట అలరించింది. ఈ సందర్భంగా పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి యాక్టివిటీస్‌లో పిల్లలను నిమగ్నం చేయడం వల్ల వారిలో సృజనాత్మకత, ప్రతిభకు అద్దం పట్టవచ్చన్నారు.

## ‘ఇన్‌టెక్–క్విజ్’ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టెక్) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ‘ఇంటెక్ హెరిటేజ్ క్విజ్–2025’ పేరిట ఎంవీపీ కాలనీ అశ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. 7 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. క్విజ్‌లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను సంప్రదించి జూలై 20లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. పోటీల వివరాలకు 98481 98701 నంబర్‌లో సంప్రదించాలి.